# స్కేళ్ళు

వి.మీనాక్షి -

సేట్ భీంచంద్ రాంచంద్ సుబ్బారావు లెక్చరర్ బజార్లో ఎదురు రావటం చూశాడు. సేట్ కోపం తారస్థాయికి చేరుకొంది. పళ్ళు పటపటా కొరికాడు. కుక్కలా కాలును నేలకు నాలుగుసార్లు రాశాడు.

దూరంగా పిల్లిలా వస్తున్న సుబ్బారావు లెక్చరర్ సేట్‌ను చూసి నిరుత్తరుడైపోయాడు. సేట్ అడిగే ప్రశ్నకు ఏం సమాధానం చెప్పాలో ఆలోచించటానికి తన బుర్ర ఉందో, లేదో నని చెయ్యి పెట్టి చూసుకున్నాడు. హిస్టరీలో పిహెచ్.డి. చేసి పిల్లలతో శభాష్ అనిపించుకున్న ఆ బుర్ర ఎక్కడుందో ఆయనకు కనిపించలేదు.

ఇంతలో సేట్ దగ్గరకు రానే వచ్చాడు. "ఏం భాయ్ ఎన్ని రోజులు అవుతావు బాకీ?" గర్జించాడు సేట్.

"యు.జి.సి. స్కేళ్ళు రానియ్యి. నీ బాకీ తీరుస్తా." అంతకంటే ఎంత సౌమ్యంగా చెప్పాలో తెలీక అలా చెప్పాడు సుబ్బారావుగారు.

"ఇదుగో మీటరు స్కేళ్ళో, అంగుళాల స్కేళ్ళో నాకు తెలియదు. 1986 నుంచి ఇదే మాట చెబుతున్నావ్. నమ్మటానికి మేము చెవిలో పూల్ పెట్టుకోలేదు భాయ్." అంతకంటే ఎలా ఈసడించుకోవాలో తెలీలేదు సేట్‌కు. కుక్కను కసిరినట్లు కసిరాడు.

"నిజమే" అన్నాడు సుబ్బారావు వెధవ నవ్వు అభినయిస్తూ.

"ఏంటి నిజమే? నా క్కావాల్సింది డబ్బు. నీ స్కేళ్ళు కావు." మరోసారి గర్జించాడు - ఉరిశిక్ష వేసే జడ్జిలా చూశాడు.

సుబ్బారావుకు చక్కని ఐడియా వచ్చింది. సేట్ చేయి పుచ్చుకొని బరబరా రోడ్డు పక్క చెట్టు కిందకి లాక్కెళ్ళాడు. అక్కడ చిలకజోస్యం చెప్పే వాడున్నాడు.

"రాండి సార్ రాండి మా చిల్కా చెప్పేవి తప్కా జర్గుతాయి రండి. ఒక్క రూపాయి మాత్రం ఇవ్వండి" అంటూ ఆహ్వానించాడు-

సుబ్బారావు వాడి పక్కనే కూర్చొని జేబులో నుంచి రూపాయి తీసి ఇచ్చాడు. చిలకవాడు ఏడు గవ్వలు చేతికి ఇచ్చి పందెం వెయ్యమన్నాడు. సుబ్బారావు పందెం వేస్తే మూడు గవ్వలు బోర్ల, నాలుగు వెల్లికిల పడ్డాయి. వెంటనే చిలకవాడు తన దగ్గరున్న నాలుగు చిలకల్లో మూడో చిలకను బయటకు వదిలాడు. అది వయ్యారంగా నాలుగుసార్లు అటూ ఇటూ తిరిగి నోటితో ఏ కాగితాన్నీ ముట్టుకోకుండా తిరిగి పంజరంలోకి వెళ్ళింది. చిలకవాడు మరోసారి ఇంకోసారి ప్రయత్నం చేసినా ఫలితం శూన్యం. చిలకవాడు సుబ్బారావుకు చేతులెత్తి నమస్కరించాడు.

"సార్ - చిలక ఏదో ఒక కాగితం తీసి నాకు ఇస్తుంది. దాంట్లో రాసి ఉన్న మీ భవిష్యత్తు చెబుదామనుకొన్నా. కానీ అది ఏ కాగితాన్ని ముట్టుకోలేదంటే మీ మనసులో ఉన్న కోర్కె తీరదనే తెలుస్తుంది. ఇదుగో మీ రూపాయి మీరే తీసుకోండి" అని తిరిగి ఇస్తూ - "దయచేసి మీ కోర్కె ఏమిటో చెబుతారా?" అని అడిగాడు.

"మా జీతాలు పెంచుతారా?" అని అడిగాడు.

"సార్ మా చిలక ప్రకారం అది జరగని పని. ఆశ వదులుకోండి" అన్నాడు.

ఇంతవరకూ మౌనంగా నిలుచున్న సేట్ మళ్ళీ విజృంభించాడు - "చూశావా నీకు యు.జి.సి. స్కేళ్ళు వచ్చే సమస్యే లేదు. వారం రోజుల్లో నా బాకీ చెల్లించకపోతే బజార్లో కట్టేస్తా. జాగ్రత్త" అని వార్నింగ్ ఇచ్చి విసవిసా వెళ్ళిపోయాడు.

సుబ్బారావు ఇంటి దారి పట్టాడు. తనకు జూనియర్ లెక్చరర్ నుంచి ప్రమోషన్ ఇచ్చి డిగ్రీ కాలేజీకి వేసినందుకు ఎంతగానో తిట్టుకున్నాడు. తనకంటే తక్కువ సర్వీసు ఉన్న జూనియర్ లెక్చరర్లు తనకంటే ఎక్కువ జీతం తీసుకుంటున్నారు. హాయిగా ఉన్నారు. డిగ్రీ కాలేజీ లెక్చరర్లకు యు.జి.సి. ఇస్తామని ఆశ పెట్టి ఆశ పెట్టి చంపుతున్నారు. అవి వచ్చేదీ లేదు, ఈ అప్పులు తీరేదీ లేదు. సేట్ లాంటి వాళ్ళతో చెప్పు దెబ్బలు ఖాయం - అనుకుంటూ రోడ్డు మలుపు తిరిగాడు. 'తారక రామా ఎంటర్ ప్రైజెస్' అన్న బోర్డు చూసి కాళ్ళు అంగుళం ముందుకు కదలలేదు.

"సుబ్బారావుగారూ" ఎంటర్‌ప్రైజెస్ మేనేజర్ పిలిచేసరికి సుబ్బారావు ప్రాణాలు గాలిలో కలిసిపోయినంత పనైంది. చిన్నగా

## మనుష్యులు మాత్రం కాదు !


ఇక్కడ అరణ్యాలే పెరుగుతాయి
మౌనమే ఊపిరిగా ఆకులు తొడిగిన చెట్లు
బందీగా తల వంచుతాయి;

ఇక్కడ మనుష్యులకు తావుండదు
మృగాలకి మాత్రం స్వేచ్ఛ -

మృగాల పదునైన కదలికలో చీలిపోతున్న అరణ్యాలు;
ముక్కలు చెక్కలైనా అవి అభయారణ్యాలే....
అభయారణ్యాల అంచుల్లో అరుపుల్లేని
ఆవులింతల నడుమ హత్యలు సాఫీగా సాగిపోతాయి;
చేవదేరిన వృక్షాల పెదవులపై అదే పనిగా గాట్లు పడతాయి;
గూళ్ళు కట్టుకున్న జంట గువ్వలు రాలిపోతాయి;
మరణశాసనాలు వీలునామాలై వేల్లాడతాయి;
నేరం భుజాలకి రెక్కలు కట్టుకుని లేచిపోతుంది;
గింజుకునే శవాలు భూమి సొరగల్లోకి -
కత్తుల గాలి విసుర్లకి భూమి పురుడు బోసుకుంటుంది;
భూమి కడుపుల్లోంచి అరణ్యాలు మొలుస్తాయి...

అరణ్యాల మీద అధికారం చెలాయించే
రంగు మారిన మృగాలు పుడతాయి...
మృగాల మూర్ఖత్వాన్ని తొలిచే వడ్రంగి పిట్ట లొస్తాయి...
మనుష్యులు మాత్రం కాదు -

- మోతుకూరి అశోక్‌కుమార్





కాళ్ళీడ్చుకుంటూ ఎంటర్ ప్రైజెస్‌లోకి వెళ్ళాడు.

"ఏం లెక్చరరువయ్యా? టీ.వీ. బాకీ మూడు వేలు ఎప్పటికయ్యా ఇచ్చేది?" అన్నాడు వానరుడు.

"యు.జి.సి. స్కేళ్ళు రాగానే" అని గొణిగాడు నరుడు.

"ఆ స్కేళ్ళతో నా కనవసరం. వారం రోజుల్లో ఇస్తే ఇచ్చినట్లు లేకపోతే బజార్లో పరువుతీయాల్సి వస్తుంది. జాగ్రత్త. వెళ్ళండి" అన్నాడు.

"సరే" అని నేల చూపులు చూసుకుంటూ బయటకు నడిచాడు సుబ్బారావు.

తనకు బి.ఏ.లో వచ్చిన గోల్డుమెడల్, ఎం.ఏ.లో వచ్చిన గోల్డు మెడల్ - తన పిహెచ్.డి.ని మెచ్చుకొంటూ వివిధ ప్రొఫెసర్లు ఇచ్చిన ప్రశంసాపత్రాలు వరసగా జ్ఞాపకం వచ్చాయి. ఇవన్నీ సేట్ ముందూ, ఎంటర్ ప్రైజస్ వాడి ముందూ దిగదుడుపే కదా ! ఇంత విజ్ఞానమూ వాళ్ళ కాలి బూటుకు సమానం కాకపోయే గదా - అని మనసులోనే కుమిలిపోయాడు. యు.జి.సి. స్కేలు 1986 నుంచి ఇస్తే సుమారు ఇరవై వేల ఎరియర్సు వస్తాయనీ, బాకీలన్నీ తీర్చవచ్చనీ అనుకొన్న సుబ్బారావుకు నిరాశే మిగిలింది.

ఎలిమెంటరీ స్కూలు మీదుగా తన ఇంటిదారి పట్టాడు. ఎవరో కుర్రాడితో మాస్టారు పద్యం పెద్దగా చదివిస్తున్నాడు.

**"అడిగిన జీతం బియ్యని**
**మిడిమేలపు దొరను కొలిచి మిడుకుట కంటెన్**
**వడిగల ఎద్దులు కట్టుక**
**మడి దున్నక బ్రతుకవచ్చు మహిలో సుమతీ !"**

ఎంత చక్కని పద్యం ! పన్నెండో శతాబ్దంలో రాసినదైనా ఈ రోజుకు కూడా ఎంత బాగా సప్పుతుంది. తను అనవసరంగా ఉద్యోగంలో చేరాడు. పిహెచ్.డి. కాగానే కిళ్ళీకొట్టు పెట్టుకున్నట్లయితే ఇప్పటికి ఆర్థికంగా ఎంతో స్థిరపడి ఉండేవాడిని అని మరీ మరీ అనుకున్నాడు. ఏం లాభం? చేతులు కాలాయి. ఇక ఆకులతో ఏం పని?

ఇంతలో తన ఇల్లు వచ్చింది. ఊహలు వదిలేసి వాస్తవంలోకి వచ్చాడు. ఇంట్లో ముందు గదిలో ఎవరో గెస్ట్ వచ్చి కూర్చున్నాడు. ఎవరా అని పరిశీలనగా చూస్తే తన ఇంటి ఓనరు.

"నమస్కారం సార్" అన్నాడు సుబ్బారావు ఒక కుర్చీలో కూలబడుతూ.

"ఆ, ఏంలే సుబ్బారావు - రాష్ట్ర ఉద్యోగులందరికీ జీతాలు పెరిగాయి కదా. అందుకని ఇంటి ఓనర్ల అసోసియేషన్ వాళ్ళం అద్దెలు కూడా పెంచాలని అనుకుంటున్నాం. ఈ నెల నుంచి రూ. 400 నుంచి రూ. 600లకు పెంచుతున్నా వస్తా" అని లేచాడు ఓనరు.

"చూడండి యు.జి.సి. స్కేళ్ళు రాగానే పెంచండి. ఇప్పుడు వద్దు" ప్రాధేయపడ్డాడు.

"ఇదుగో 1986 నుంచి యు.జి.సి. స్కేళ్ళు అంటూనే ఉన్నావు. ఇంకా అవొస్తాయి అని ఆశ నీకేమన్నా ఉందేమో కాని నాకు లేదు. అద్దె రూ. 600లు గుర్తుంచుకో" అని వెళ్ళిపోయాడు.

సుబ్బారావు కుర్చీలోంచి లేచి ఒక్కసారి మళ్ళీ కూలబడ్డాడు. ఇంట్లో నుంచి శ్రీమతి వచ్చి మంచినీళ్ళు, కాఫీ ఇచ్చి వెళ్ళింది. శ్రీమతి సరిగా మాట్లాడక రెండు నెల లయింది. తనకు కంచిపట్టు చీర కావాలట. యు.జి.సి. రాగానే కొనిపెడతానని చెబితే మొదట్లో కొన్ని నెలలు నమ్మింది. ఇక నమ్మటం మానేసింది. ఇంతలో బజార్నుంచి పెద్దబ్బాయి వచ్చాడు. వాడికి సైకిల్ కావాలట. యు.జి.సి. రాగానే కొంటానని చెప్పాడు. వాడు కూడా నాలుగు నెలలయింది మాట్లాడటం మానేసి.

** ** **

నేను సాయంకాలం టీ.వీ. చూస్తున్నా వార్తలకు ముందు తప్పిపోయిన వాళ్ళ పేర్లు, అడ్రసులు చెబుతున్నారు.

"సుబ్బారావు అనే నలభై ఏళ్ళ వ్యక్తి మతిస్తిమితం లేక తప్పిపోయాడు. ఎత్తు 5'.6". ఎర్రగా ఉంటాడు. తెలుగు, ఇంగ్లీషు భాషలు చక్కగా మాట్లాడుతాడు. ఎప్పుడూ యు.జి.సి. స్కేలు రాగానే మీ బాకీ తీరుస్తానని ప్రతి వాళ్ళకూ చెబుతూ ఉంటాడు. ఆచూకీ తెలిసిన వాళ్ళు ఈ చిరునామాకు తెలియజేయండి" అని ఇంకా ఏదో చెప్పారు.

నా కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. సుబ్బారావు నా క్లాస్‌మేట్. ఎంతో తెలివిగలవాడు. నేను పి.యు.సి. చదువుతో మానేసి బాంకులో చేరి ఈ రోజు పెద్ద ఆఫీసర్నయాను. స్వంత ఇల్లు. అయిదు వేల జీతం. జీవితం చక్కగా గడిచిపోతున్నది. పాపం సుబ్బారావు కష్టపడి బి.ఏ., ఎం.ఏ., పిహెచ్.డి. చేసి ఏం సాధించాడు - మతిస్తిమితం లేకపోవటం తప్ప?

సుబ్బారావు నాకు కనిపిస్తే బావుండు అని ఆలోచిస్తూ అలా సోఫాలోకి వాలిపోయాను. ★